నాడు గలగల.. నేడు వెలవెల

కేసీఆర్ హయాంలో తాపీగా రెండు పంటలు పండించుకున్న కర్షకులు.. ఇప్పుడు సాగునీరందక అల్లాడుతున్నారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీలా గ్రామ శివారులోని నీలా–కొప్పర్గా, నీలా– కల్దుర్కి గ్రామాల రైతుల సౌలభ్యం కోసం కేసీఆర్ హయాంలో రూ.7 కోట్లతో రెండు చెక్ డ్యాంలు నిర్మించారు. గతంలో వానకాలం పంటకే పరిమితమైన 2 వేల ఎకరాల్లో యాసంగికి కూడా ఢోకా లేకుండా పోయింది. చెక్‌డ్యాంల వద్ద నిలిచిన నీటితో భూగర్భ జలాలు పెరిగి సాగు నీటి కష్టాలకు చెక్‌పడింది. గతంలో నిండు వేసవిలోనూ గలగల పారిన చెక్ డ్యాంలు.. రేవంత్ సర్కారు వచ్చాక వెలవెలబోయాయి. పొట్టదశలో ఉన్న వరి నిలువునా ఎండిపోతున్నది.- రెంజల్

రైతు గుండెలో నీటి మంటలు

ఇన్ని గింజలు పండుతయని పూడిక తీయిస్తున్న

ఐదేండ్ల నుంచి ఎన్నడు కూడ పూడిక తియ్యలె. నీళ్లు ఎల్లక సేను ఎండిపోతాంది. సేను కూడ ఇంత రోగమొచ్చింది. దీంట్ల నీళ్లు ఎల్లక గోసయితంది. నాలుగు ఎకరాలకు నీళ్లు వరుస తల్లు పెడుతున్న. కొంత ఎండుతంది ఏం జేయ్యాలే అర్థమైతలేదు. ఒకప్పటి లాగ రాత్రి పూట వచ్చి కరెంట్‌పెడుతున్నం. అయినా బాయిల ఊట వత్తలేదు. ఇన్ని గింజలన్న పండుతయని బాయిల పూడిక తీయిస్తున్న. ఈ సారి సేనుపోయి లాస్ అయ్యేటట్టే ఉన్నదని భయమైతున్నది. -అయిలేని రాజిరెడ్డి, రైతు, హుస్నాబాద్ (సిద్దిపేట జిల్లా)

'బోరు'మంటున్న చెన్నమ్మ

హన్వాడ, మార్చి 18 : ఓ వైపు తగ్గుతున్న భూగర్భ జలాలు.. మరోవైపు చెరువులు, బావులు అడుగంటుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు ఆశంగారి చెన్నమ్మ ఎకరంన్నర పొలంలో యాసంగిలో వరి సాగు చేసింది. ప్రస్తుతం పంట చేతికొచ్చే సమయంలో నీళ్లు అందక ఎండుముఖం పట్టింది. మంగళవారం రూ.లక్ష అప్పు చేసి 300 ఫీట్ల లోతులో రెండు బోర్లు డ్రిల్లింగ్ చేయించినా చుక్కనీరు రాకపోవడంతో చెన్నమ్మ దిక్కుతోచని స్థితిలో పడింది. పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని, అప్పులకు వడ్డీ పెరిగిపోతున్నదని కంటతడి పెట్టుకున్నది.

ఎండుతున్న పైరు.. రైతన్న కన్నీరు

బోర్లు వట్టిపోవడంతో వరి ఎండిపోతున్నది. నిజాంసాగర్ చివరి ఆయకట్టుకు నీరందక రైతాంగం అల్లాడుతున్నది. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జైనాపూర్ శివారులో 400 ఎకరాల్లో సాగుచేసిన వరి ఎండిపోతున్నది. చివరి తడి పెడితే పంట చేతికొచ్చే పరిస్థితి ఉండగా, నీళ్లు లేక పొలాలు నెర్రెలు బారుతున్నాయి. - కోటగిరి

కోయిల్‌సాగర్ నీటిని సాగుకు ఇవ్వలేం

దేవరకద్ర, మార్చి 18 : కోయిల్‌సాగర్ నీటిని సాగు కోసం ఇవ్వలేమని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి స్పష్టం చేశారు. కేవలం తాగు నీటి కోసం ప్రాజెక్టులో నీటిని నిల్వచేసినట్టు చెప్పారు. మంగళవారం ఆమె మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరు శివారులో ఎండిన పంటలను పరిశీలించారు. కోయిల్‌సాగర్ నుంచి రెండ్రోజులు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

తలాపునే తపాస్‌పల్లి.. పంటనే మో ఎండిపాయె

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 18 : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన రైతు మ్యాదల కిష్టయ్య యాసంగిలో రెండెకరాల్లో వరి పంట వేశాడు. తలాపునే తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నా డీ4 కెనాల్ ద్వారా నీళ్లు విడుదల చేయకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు పోయక రైతు కిష్టయ్య పంట ఎండిపోతున్నది. ఇప్పటికే సగం వరకు పంట ఎండిపోగా మిగిలిన పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో వరి పంటకు నీటిని అందిస్తున్నాడు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు ఎండాకాలంలోనూ డీ4 కెనాల్‌లో నీటిని విడుదల చేసి మత్తడి దుంకించారని రైతు కిష్టయ్య చెప్పాడు.

రమేశ్ గౌడ్ సతీశ్

కరెంట్ కాటుకు ఇద్దరు రైతులు బలి

ఐనవోలు/రామారెడ్డి(సదాశివనగర్), మార్చి 18 : పొలాల్లో విద్యుత్తు తీగలు తెగి పడటంతో ఇద్దరు రైతులు కరెంట్ షాక్‌తో మరణించారు. ఈ ఘటనలు హనుమకొండ, కామారెడ్డి జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కొండపర్తిలో గ్రామానికి చెందిన బాల్నె రమేశ్ గౌడ్ (45) కులవృత్తితోపాటు వ్యవసాయం చేస్తున్నాడు. తనకున్న ఎకరంన్నర భూమిలో వరి సాగుచేయగా, బోరు బావిలో నీళ్లు అడుగంటుతున్న క్రమంలో ఉదయమే నీళ్లు పారించేందుకు వెళ్లాడు. మోటర్ పని చేయకపోవడంతో బోరు వద్ద అటు, ఇటు తిరిగే క్రమంలో విద్యుత్తు తీగ తగలడంతో షాక్‌కు గురై పక్కనే ఉన్న ఒర్రెలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరోవైపు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ఉత్తునూర్ గ్రామానికి చెందిన గుడిసె సతీశ్ (25) మంగళవారం పొలంలో పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. పురుగు మందులో నీళ్లు కలపడానికి పొలం పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దిగాడు. అప్పటికే విద్యుత్తు తీగ తెగిపోయి ఆ బావిలో పడి ఉండటంతో సతీశ్ కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు.

సాగుకు నీళ్లిస్తరా లేదా?

కొమురవెల్లి, మార్చి 18 : సాగుకు నీళ్లిస్తరా లేదా? అని బీఆర్ఎస్ నాయకులు అధికారులను ప్రశ్నించారు. నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయంటూ వారు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గీస భిక్షపతి ఆధ్వర్యంలో మండుటెండలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి తపాస్‌పల్లి రిజర్వాయర్ పరిశీలనకు వచ్చినప్పుడు రెండు రోజుల్లో నీళ్లు వస్తాయని చెప్పి వెళ్లాడని, ఆయన చెప్పి పదిరోజులైనా ఇప్పటికీ నీళ్లు రాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మేమే వాళ్ల బట్టలిప్పి కొడ్తం

మొదటిపేజీ తరువాయి...

సూర్యాపేటలో మేం గెలిచినమా? అన్నడు. పొలం కండ్ల ముందే ఎండిపోయింది. పదెకరాలు ఎండుగడ్డిలా మారింది. గొర్రెల మేతకు ఇచ్చిన. కేసీఆర్, మీరు (జగదీశ్‌రెడ్డి) ఉన్నప్పుడే మాకు నీళ్లొచ్చినయ్. ఇప్పటికంటే కరువున్నా.. ఎక్కడి నుంచో నీళ్లు తెచ్చి మా పొలాలకు పారిచింద్రు. మీ పాలన పోయింది.. నీళ్లు కూడా పోయినయ్. నాలుగు లక్షల అప్పు చేసి పొలం పెట్టిన. ఆ అప్పెట్ల తీరాల్నో.. కుటుంబం ఎట్ల గడువాల్నో తెలుస్తలేదు' అంటూ దుబ్బతండాకు చెందిన రైతు భూక్యా జామ్లానాయక్ ఆవేదన వ్యక్తంచేశాడు.

'కాల్వకు నీళ్లు వదులుతమంటే మూడెకరాల వరిచేను పెట్టిన. అట్లా ఎదుగుతున్న చేను నీళ్లు లేక మొత్తం ఎండింది. పంటెండుతుంటే పుస్తెలతాడు కుదువ పెట్టి మూడు బోర్లేసిన. చుక్క నీళ్లు రాలే. మొత్తం ఇట్లనే ఎండిపోయింది. చేసేది లేక గొర్రెల మేతకు పొలం ఇచ్చిన. మా చుట్టుపక్కల మూడు, నాలుగు తండాల్లో పంటలన్నీ ఇట్లనే ఎండినయ్. కాంగ్రెసొచ్చింది.. తండాల్లో కరువు చూస్తు న్నం' అంటూ రత్యాతండాకు చెందిన భూక్యా మంగమ్మ మండిపడింది.

'అప్పట్లో నీళ్లు లేక వరి పెట్టకపోయేది. జొన్నలు వేసి గొడ్లను సాదుకునేది. కేసీఆర్ సర్కారు పోయినంక మళ్లీ అప్పటి రోజులే కనిపిస్తున్నయ్. మాకు కాళేశ్వరం నుంచి కాల్వ ద్వారా ఐదారేండ్లు పుష్కలంగ నీళ్లిచ్చినయ్. చూద్దామని ఓసారి కాంగ్రెస్‌కు ఓటేసినం. మోసపోయి నరకం చూస్తున్నం. అప్పులిచ్చినోళ్లకు ఏం చెప్పాలె? చావుతప్ప ఏమీ కనిపిస్తలేదు' అంటూ దుబ్బాతండాకు చెందిన నూనావత్ అనిల్ ఆక్రోశం వెలిబుచ్చాడు.

'ఎకరాకు 30 వేలు పెట్టుబడి పెట్టినం. పంట మొత్తం పోయింది. మాకు నీళ్లొస్తలేవు. కేసీఆర్ ఉన్నప్పుడు నీళ్లు మంచిగ వస్తుండె. ఇప్పుడు నీళ్లు లేక పంట మొత్తం పోయింది. రైతుబంధు రాలేదు. రుణమాఫీ కాలేదు. సన్నవడ్లు వెయ్యిండ్రంటే వేసినం. బోనస్ ఇయ్యలేదు. ఇంత ఘోరం ఎప్పుడు లేదు. మళ్లా ఓట్లొస్తే కాంగ్రెస్నోళ్ల సంగతి చెప్తం' అంటూ రత్యాతండా భూక్య విజయ రగిలిపోయింది.

పెన్‌పహాడ్ మండలం దుబ్బతండాలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి గోడు వెల్లబోసుకుని కంటతడి పెట్టిన రైతు జమ్లానాయక్

ఏ రైతును కదిలించినా ఆవేదనే!

గతంలో కాళేశ్వరం నుంచి వచ్చిన గోదావరి జలాలతో సస్యశ్యామలమైన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల పరిధిలో ఇప్పుడు ఏ రైతును కదిలించినా ఇదే ఆవేదన కనిపిస్తున్నది. దారి పొడవునా ఎండిన పొలాల్లో నిలబడి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి తమ గోడు చెప్పుకొనేందుకు రైతులు ఎదురుచూస్తూ కనిపించారు. దుబ్బతండా, రత్యాతండా పరిధిలో మచ్చుకు కొన్ని పొలాలను పరిశీలించే ప్రయత్నంలో ఏ రైతును కదిలించినా కన్నీటి గాథలే వినిపించాయి. కేసీఆర్ అప్పుడు ఎన్నడూ ఇట్ల కాలే. కాంగ్రెసొచ్చింది. కరువు తెచ్చింది. ఎట్లైనా చేసి నీళ్లు ఇప్పించే ఆలోచన చేయండ్రి. మీ వెంట కొట్లాటకు ఎక్కడికైనా వస్తం. అసెంబ్లీకి రమ్మన్నా వస్తం' అంటూ పలువురు జగదీశ్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి కాళేశ్వరం జలాలు విడుదల చేయకపోవడంతో యాసంగి పంటలన్నీ ఎండుతుంటే ఏం చేయాలో తెలియక రైతులు దిక్కులు చూస్తున్నారు.

పొలం ఎండని రైతు లేడు

దుబ్బతండా, రత్యాతండాలో వరి సాగు చేసిన ప్రతి రైతుకు చెందిన ఎంతో కొంత భూమి ఎండిపోయింది. జనవరి ఒకటి నుంచి మార్చి 31 వరకు ఒక్కో జోన్‌కు ఒక్కో వారం చొప్పున వారబందీ పద్ధతిలో నీళ్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. తీరా పొలాలు పెట్టి వరి పొట్ట దశకు వచ్చే సరికి కాల్వకు నీళ్లు విడుదల చేయలేదు. దాంతో ప్రతి ఊళ్లో వందల ఎకరాలు ఎండిపోయాయి. ఈ సీజన్‌లో ఒక్కో రైతు కనీసం రెండు, మూడు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు.

ఇప్పటికైనా నీళ్లిస్తే కాళ్లు కడిగి నెత్తిన పోసుకుంట

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

'మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఒక్కటే అడుగుతున్న. ఇప్పటికైనా ఏక్కడి నుంచైనా సరే నీళ్లు తెచ్చి ఎండుతున్న పొలాల్లో పారించి పంటలు కాపాడితే ఆ నీళ్లతోనే ఉత్తమ్ కాళ్లు కడిగి నా నెత్తిన పోసుకుంటా' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. 'కాళేశ్వరాన్ని బందు పెట్టి దుర్మార్గంగా వేల ఎకరాలు ఎండబెడుతున్నరు. రైతుల మీద కక్షగట్టినట్టు వ్యవహరిస్తున్నరు.. మీకు చేతగాకపోతే కాళేశ్వరాన్ని ఇప్పటికైనా కేసీఆర్‌కు అప్పజెప్పండి.. మూడు రోజుల్లోనే సూర్యాపేట జిల్లా వరకు నీళ్లు పారిస్తం.. ఉత్తమ్ పద్మావతి నియోజకవర్గమైన కోదాడలోని చివరి గ్రామం వరకు నీళ్లందించి చూపిస్తం' అంటూ సవాల్ చేశారు. 'కాళేశ్వరాన్ని కాదని ప్రత్నామ్నాయంగా నీళ్లు తెచ్చి ఒక్క ఎకరానికి అందించినా నీ కాళ్లు కడిగి నెత్తిన పోసుకునేందుకు సిద్ధం' అంటూ ఉత్తమ్‌కు సవాల్ విసిరారు. సూర్యాపేట జిల్లాలో ఎటుచూసినా కిలోమీటర్ల మేర పంటలు ఎండిపోయాయని, నెల నుంచి ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదని విమర్శించారు. రైతుల కష్టాలు, కన్నీళ్లను అసెంబ్లీలో ప్రస్తావించే ప్రయత్నం చేస్తే సస్పెండ్ చేసి కక్ష సాధింపు చర్యలకు దిగారని వాపోయారు. 'ఇది ప్రకృతితో వచ్చిన నష్టం కాదు.. ప్రభుత్వం నీళ్లు ఇస్తానంటేనే రైతులు పంటలు వేశారు.. తీరా పంట చేతికి వచ్చే సమయంలో నీళ్లు బంద్ చేశారు.. అందుకే ఎకరాకు ప్రభుత్వం రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీద యుద్ధం చేసేందుకు రైతులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మరో ఇద్దరు రైతుల బలవన్మరణం

రాజం రామెల్ల సతీశ్

జగిత్యాల రూరల్/వెంకటాపురం(నూగూరు), మార్చి 18 : సాగు కలిసి రాక, అప్పులు మీదపడి మనస్తాపంతో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు జగిత్యాల, ములుగు జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వివరాలు ఇలా.. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన మతులాపురం రాజం (55) తనకున్న 25 గుంటలతోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గతంలో ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి తిరిగి రావడం, సాగు పెట్టుబడికి అప్పులు చేయడం, దిగుబడులకు సరైన ధర రాకపోవడం, కౌలు భరోసా అందకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.సుమారు రూ.15 లక్షల వరకు అప్పు కాగా, మనోవేదనతో మంగళవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజం కుటుంబ సభ్యులను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించి, ధైర్యం చెప్పారు. అసమర్థ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి అటు రైతు భరోసా ఇవ్వక, ఇటు రుణమాఫీ చేయక, సాగునీరు అందించకపోవడంతో పంట దిగుబడి లేక అప్పుల పాలై అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

మిర్చి రైతు సతీశ్..

ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు) మండల పరిధి బెస్తగూడెం గ్రామానికి చెందిన రైతు రామెల్ల సతీశ్(39) మూడు ఎకరాల్లో మిర్చి తోటను సాగు చేశాడు. పంట చేతికొచ్చినా కూలీలు దొరక్క కాయలు నేలరాలి నష్టపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సతీశ్ 15 రోజులుగా మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మిర్చితోట వద్దకు వెళ్లి మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.